క్లుప్తంగా

కుల గణన వేగవంతంగా చేపట్టండి

దొనకొండ: గ్రామాల్లో కుల గణన వేగవంతంగా చేపట్టి నివేదిక అందించాలని తహసీల్దార్ ఎం.సువర్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కుల గణన చేపట్టి ఈకేవైసీ చేయించాలన్నారు. ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్య ధోరణి వహిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరికలు జారీ చేశారు. ఎంపీడీఓ వసంతరావునాయక్ పాల్గొన్నారు.

వెలుగొండలో కార్తీక సందడి

కొనకనమిట్ల: కార్తీక మాసం పురస్కరించుకొని మండలంలోని వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.

చిరుధాన్యాల సాగు రైతుకు లాభసాటి

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు చిరుధాన్యాల సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని మాధవరంలో శనివారం చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ ఎకరా వరి సాగుకు ఖర్చు చేసే నీటితో పది ఎకరాల చిరుధాన్యాల సాగు చేయవచ్చన్నారు. చిరుధాన్యాలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఖాళీగా ఉన్న భూముల్లో మైనర్ మిల్లెట్స్ సాగు చేసుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బోర్ల ద్వారా వచ్చే నీటితో ఆరు తడులకు నీరు ఉపయోగించుకోవచ్చన్నారు. సాగర్ జలాల నీటి లభ్యత లేనందున చిరుధాన్యాల సాగుపై ఆశక్తి పెంచుకోవాలన్నారు. వీఏఏ సుధీర్, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

మార్కాపురం టౌన్: ట్రాఫిక్ చట్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని మార్కాపురం ఆర్టీఓ అమర్‌నాయక్ అన్నారు. శనివారం స్థానిక కమలా కాన్సెప్ట్ స్కూల్‌లో రవాణా శాఖ చట్టాలు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి ఒక్కరికీ లైసెన్స్ ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ రంజన్, రవాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

పుల్లలచెరువు: అప్పులబాధ తట్టుకోలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని గాజులపాలెంలో శనివారం జరిగింది. వివరాలు.. గాజులపాలేనికి చెందిన మేకల సుబ్బారావు (37) తనకు ఉన్న రెండు ఎకరాలతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప సాగు చేస్తున్నాడు. పంటలు సక్రమంగా లేకపోవడంతో పాటు పెట్టుబడులు కూడా పెరగడంతో చేసేది లేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో కూలీ పనుల కోసం తెలంగాణ వెళ్లి వచ్చేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. స్థానిక బాప్టిస్ట్ పాలెంలో వేల్పుల రూబేన్ అనే వ్యక్తి అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం వారి కుటుంబ సభ్యులకు అందించారు. సంస్థ చైర్మన్ మువ్వల పార్థసారధి, కాటూరి పెద్దబాబు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేయండి

మార్కాపురం రూరల్: గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ టి. చందన ఆదేశించారు. కొండేపల్లిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళిక ప్రక్రియ కోసం సామాజిక మ్యాప్‌ను తయారుచేశారు. ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి, కుందురు చిన్నవెంకటరెడ్డి, సర్పంచ్ కుందురు బాలమ్మ, ఏపీఎం జీవరత్నం, ఈసీలు, టీఏ, ఎఫ్ఏ పాల్గొన్నారు.

కన్నుల పండువగా శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి. కేశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షులు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థుల ఆటలపోటీలు


చదరంగం ఆడుతున్న విద్యార్థులు


ఆకవీడులో..

పెద్దారవీడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు శనివారం నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థులకు పరుగు పందెం, డిబేట్, యోగా, స్కిపింగ్, తదితర పోటీలు నిర్వహించారు. పెద్దారవీడు గ్రామానికి చెందిన గొట్టం కోటిరెడ్డి ఉచితంగా యాంపిప్లేయర్, సౌండ్ బాక్సులు గ్రంథాలయానికి అందజేశారు. గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయం అబివృద్ధికి దాతలు సహకరించాని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ, 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాచర్ల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా రాచర్ల, ఆకవీడు గ్రామాల్లోని గ్రంథాయాలల్లో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు లెమన్ స్పూన్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విద్యార్థులకు 20వ తేదీన బహుమతులు పంపిణీ చేస్తున్నట్లు రాచర్ల, ఆకవీడు గ్రంథపాలకులు కె.శ్రీధర్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు

తర్లుపాడు: స్థానిక శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండలంలోని విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ తర్లుపాడు, చెన్నారెడ్డిపల్లి, మీర్జపేట, స్థానిక లూథరన్ పాఠశాల విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శాస్త్రి, ఎం. ప్రకాష్ పోటీలను పర్యవేక్షించారు. లైబ్రేరియన్ పీవీ సుబ్బారెడ్డి తెలిపారు.


వెంకటేశ్వరరెడ్డికి యాంపీప్లేయర్ అందిస్తున్న కోటిరెడ్డి

రూ. 5 లక్షల చెక్కు పంపిణీ


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి బాధిత కుటుంబానికి శనివారం తన క్యాంపు కార్యాలయంలో అందించారు. మండలంలోని భూపతిపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ ఇటీవల విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన నేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన 5 లక్షల రూపాయల చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అందించారు. ఈఈ నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి సైతం టీడీపీ పాలనను కోరుకోవడం లేదు


ప్రజలకు బుక్‌లెట్ అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పుల్లలచెరువు: నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రజలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రకృతి సైతం టీడీపీ పాలనను కోరు కోవడం లేదని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పిడికిటివానిపల్లి సచివాలయం పరిధిలో ఎంపీడీవో ఆధ్వర్యంలో సర్పంచ్ మస్తాన్‌రెడ్డి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగన్ కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయం పరిధిలో రూ.21 కోట్ల 40 లక్షలకు సంబంధించి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించారని, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే వచ్చే ఎన్నికల్లో కూడా జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తూ వివరించారు. ఎంపీపీ కందుల వెంకటయ్య, సర్పంచ్‌లు ఆవుల కోటిరెడ్డి, ఆవుల లక్ష్మీదేవి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, ప్రజానాయకులు రమణారెడ్డి, మస్తాన్‌రెడ్డి, రామిరెడ్డి, ఏపీఎం వెంకటయ్య, ఎంఎల్‌ఓ వాసు పాల్గొన్నారు.

కృషితో లక్ష్య సాధన సాధ్యం


ఫ్రెషర్స్‌డే వేడుకల్లో వీసీ అంజిరెడ్డి

మార్కాపురం: విద్యార్థులకు కృషి పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం. అంజిరెడ్డి అన్నారు. శనివారం డాక్టర్ సామ్యేల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, డిప్లొమా, ఐటీఐ మొదటి సంవత్సర విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ అన్ని రకాల నైపుణ్యాలు లేకపోయినా రెండు మూడు అంశాల్లో క్షుణ్ణంగా ప్రావీణ్యాన్ని నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఓఎస్‌డీ డాక్టర్ కేవీఎన్ రాజు మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ మాట్లాడుతూ కళాశాలలోని అన్ని రకాల వనరులను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, కార్యక్రమం కోఆర్డినేటర్ విజయ్‌బాబు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వీసీ అంజిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఘనంగా నాగమయ్య స్వాముల తిరునాళ్ల


స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

దొనకొండ: దొనకొండ నుంచి చందవరం వెళ్లే ఏటి రాళ్ల గుట్ట వద్ద వెలసిన శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి, పెదన్నపాలెం చెరువుకట్ట వద్ద వెలసిన శ్రీవల్లీ సుబ్రమణ్యేశ్వరస్వామి తిరునాళ్ల భక్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొక్కుబడులు ఉన్న మహిళలు పొంగళ్లతో స్వామిని దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాఘవశర్మ, వెంకటశర్మ పూజలు చేశారు.

స్వాముల వారి కళ్యాణం

శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కళ్యాణం పూజారి రెంటచింతల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కళ్యాణం ఘనంగా జరిపారు. గణపతి పూజ, పుణ్యాహ వాచకం, స్వామివార్లకు అభిషేకం, పుష్పాలంకరణతో పూజా కార్యక్రమం జరిపారు. కళ్యాణానికి మహిళలు సుమారు 300 మంది పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దొనకొండకు చెందిన బంగారం కొట్టు మాడిశెట్టి వారు శివలింగం బహూకరించి పీఠల మీద కూర్చున్నారు. తిరునాళ్లకు విచ్చేసిన భక్తులకు రామిరెడ్డిపల్లెకు చెందిన రామిరెడ్డి వెంకట సతీష్‌రెడ్డి అన్నదానం చేశారు.

రంగస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు


దర్శనం కోసం క్యూలో నిలబడిన భక్తులు

రాచర్ల: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో వచ్చారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో తొలుత భక్తులు ఆలయం సమీపంలో ఉన్న నీటి గుండంలో స్నానాలు చేసి ఆదిలక్ష్మి అమ్మవారికి, నెమలిగుండ్లరంగ నాయక స్వామి వారికి కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మమ్మ వనంలోని అమ్మవారికి భారీ ఎత్తున మహిళ పూజలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. స్వామి వారి దర్శనం కోసం కర్నూలు, నంద్యాల, గుంటూరు, విజయవాడ, వైఎస్సార్ జిల్లా నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చారు. భక్తులకు అహారం కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తుగా కాశినాయన రెడ్ల, యోగివేయన రెడ్ల, గోపాలకృష్ణయాదవ, కాపు బజలి, ఆర్యవైశ్య అన్నదాన సత్రాల్లో అన్నదానం చేశారు.

పైలెట్ ప్రాజెక్టు కింద కేజీబీవీ ఎంపిక


ట్యాబ్‌లతో తొమ్మిదో తరగతి విద్యార్థినులు

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ట్యాబ్‌లు ఎలా వినియోగిస్తున్నారు అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం 19వ తేదీన టిక్టోరా కంపెనీ ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో ట్యాబ్‌ల ద్వారా విద్యను ఎలా అభ్యసిస్తున్నారో అనే అంశంపై గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుపై 20 మార్కులకు పరీక్ష నిర్వహించనున్నారు. అందులో భాగంగా అధికారులు పాఠశాలల్లో ట్యాబ్ వినియోగంపై తనిఖీ చేసి ఇచ్చిన వివరాల ఆధారంగా జిల్లాలో ఐదు పాఠశాలలను జిల్లా అధికారులు ఎంపిక చేశారు. కొత్తపట్నం జెడ్పీ, మార్కాపురం జెడ్పీ పదో వార్డు పాఠశాల, దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పుల్లలచెరువు, మార్కాపురం బాలికల పాఠశాలలను ఎంపిక చేశారు. విద్యార్థులకు సీబీఎ–2 ఎనిమిదో తరగతికి 2022–23 సంబంధించి ప్రశ్నపత్రం ద్వారా పరీక్షను నిర్వహించనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లిల్లీ ప్రకాష్‌వాణి తెలిపారు.

'నా బడి-నా చెట్టు'విజయవంతం


మొక్కలు చూపుతున్న విద్యార్థులు

దర్శి: నో బ్యాగ్ డే సందర్భంగా నాబడి–నా చెట్టు అనే వినూత్న కార్యక్రమానికి మండలంలోని కట్టశింగన్నపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం శ్రీకారం చుట్టారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించి, వాతావరణ సమతుల్యతను కాపాడటం ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సుధాకరరావు తెలిపారు. పాఠశాల విద్యార్థులంతా తమకు కేటాయించిన మొక్కలను ప్రతి రోజు నీరు పోసి జాగ్రత్తగా చూసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు జి.వేణు, హైమావతి పాల్గొన్నారు.

సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలు

గిద్దలూరురూరల్ : ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు స్థానిక రేడియో బావి సమీపంలో సత్యసాయిబాబా మందిరంలో సత్యసాయిబాబా 98వ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలే పునాది

కంభం: పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలే ప్రధాన భూమికలని ఎంఈఓ మాల్యాద్రి అన్నారు. వార్షిక కార్యాచరణలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన సూక్ష్మ ప్రణాళికలను రూపొందించే కార్యక్రమంలో భాగంగా వసతులు, సౌకర్యాలు మెరుగు పరిచేందుకు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఎంఈఓ–2 శర్వాణి, మండల సమన్వయకర్త చిన్ని పద్మావతి, శేఖర్ పాల్గొన్నారు.

చడ్డీ గ్యాంగ్‌తో ప్రమాదం

మార్కాపురం: డివిజన్‌లోని మార్కాపురం, కంభం, గిద్దలూరు నియోజకవర్గాల పరిధిలో రైల్వేస్టేషన్ సమీప ప్రాంతాల్లో ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ జి. వీరరాఘవరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో చెడ్డీ గ్యాంగ్ సంచరిస్తుందన్న వార్తల నేపథ్యంలో రైల్వే ట్రాక్‌ల సమీపంలో నివశించేవారు, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే డయల్ 100 లేదా సంబంధిత ఎస్సైకి వెంటనే సమాచారం అందించాలని కోరారు. చడ్డీగ్యాంగ్ ముఠా సభ్యులు రైళ్లలో వచ్చి దొంగతనాలు చేసే అవకాశం ఉందన్నారు. రైల్వేస్టేషన్ సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. చడ్డీ గ్యాంగ్ సభ్యులు మంచినీళ్లు కావాలనే నెపంతో గ్రూపుగా ఇళ్ల వద్దకు వచ్చి దొంగతనాలకు పాల్పడతారని హెచ్చరించారు.

పేదలకు ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ

పెద్దదోర్నాల: ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ ఆధ్వర్యంలో పేదలకు ఫుడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీఓయూఐ, ఏఐటీసీసీ వ్యవస్థాపకుడు పీడీ సుందరరావు జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంగటి మణికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అజయ్, అబ్రహం, ప్రదీప్, ప్రవీణ్, బాబీ పాల్గొన్నారు.

కేసులు రాజీ మార్గానికి కృషి చేయాలి

గిద్దలూరు రూరల్ : కక్షి దారులందరూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి బి.దేవేంద్రారెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారాదానమ్మ అన్నారు. శనివారం ఉదయం కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్ కేసులను రాజీ పడే విధంగా ఇరువర్గాల వారితో మాట్లాడాలని సూచించారు. గిద్దలూరు, కంభం సీఐలు దేవప్రభాకర్, ఎం.రాజేష్‌కుమార్, ఎక్సైజ్ సీఐ బి.అరుణకుమారి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘునాథరెడ్డి, ఎస్సైలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

బేస్తవారిపేట: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై బి.నరసింహారావు అన్నారు. శనివారం స్థానిక జంక్షన్, పందిళ్లపల్లె టోల్‌ప్లాజా వద్ద ప్రయాణికులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ఉపయోగించడంతో తలకు ఎటువంటి గాయం కాదన్నారు. ఎక్కువ శాతం ప్రమాదాల్లో తలకు తగిలిన గాయాలతో మరణాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. తలకు గాయాలైతే లక్షల ఖర్చుతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడంతో పాటు ప్రాణాలకు భరోసా ఉండదన్నారు. మీ కుటుంబాలకు ఆధారమైన మీరు క్షేమంగా ఉండాలంటే హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

వర్షం కోసం పూజలు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామస్తులు వర్షం కోసం శనివారం పూజలు చేశారు. జేపీ చెరువు గ్రామానికి చెందిన రైతులు వర్షాలు లేకపోవడంతో సాగు చేసుకున్న పంటపొలాలు ఎండుముఖం పడుతున్నాయని గ్రామస్తులు నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్లరంగనాయకస్వామి ఆలయం వద్దకు చెరుకుని ఆదిలక్ష్మి అమ్మవారికి, నెమలిగుండ్లరంగనాయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

తర్లుపాడు: మండలంలోని గానుగపెంట ఎస్సీ కాలనీలో శనివారం జలజీవన్ మిషన్ పనులను ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ పుచ్చకాయల తిరుపతమ్మతో కలిసి భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. త్వరలో గ్రామంలో నీటి సమస్య తీరుతుందని ఎంపీపీ తెలిపారు. స్థానిక ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. వైస్ ఎంపీపీ పుణ్యవతమ్మ, వైస్ సర్పంచ్ కొమ్ము నర్సమ్మ, కిరణ్ పాల్గొన్నారు.

ఆర్టీఓ ప్రత్యేక పూజలు

మార్కాపురం: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో జరిగిన పడిపూజలో రోడ్డు రవాణాశాఖాధికారి అమర్‌నాయక్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత రెండు రోజులుగా అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు దీక్షదారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి. గోపాల మల్లిఖార్జునరావు, పడుచూరి కృష్ణయ్య, గురుస్వాములు శివ, భవాని, పి. సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్‌లో 21 బైకులు సీజ్


కార్డెన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు

దర్శి: ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు డీఎస్పీ టి.అశోకవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం కార్డెన్ సెర్చ్ చేశారు. కార్డెన్ సెర్చ్‌లో దర్శి సబ్ డివిజన్ పోలీసులు, సెబ్ పోలీసులు పాల్గొన్నారు. ఆటోనగర్‌లో గంజాయి మరియు చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయని సమాచారం రావటంతో వేకువ జామున 4 గంటలకు సుమారు 60 మంది సిబ్బంది ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు చూపని 21 బైక్‌లు, నాలుగు ఆటోలను సీజ్ చేశారు. ప్రజలకు గంజాయి, మదక ద్రవ్యాల దుష్ప్రభావాల గురించి వివరించారు. సీఐ రామకోటయ్య, దర్శి,తాళ్లూరు ఎస్సైలు పాల్గొన్నారు.